# ఐ లవ్ యూ... బామ్మా!

వేదుల
వంశీ కిరణ్

2045 A.D

''విషాల్... విషాల్''

''యస్ మామ్ కమింగ్'' పర్సనల్ కంప్యూటర్ స్విచ్ ఆఫ్ చేసి క్రిందకు వచ్చాడు.

మమ్మీతోబాటు ఇంకొకావిడ కూడా ఉండటంతో ప్రశ్నార్థకంగా చూస్తూ విష్ చేసాడు.

''విషాల్, ఈవిడ నీకు బామ్మ ఔతుంది. అంటే గ్రాండ్ మా. ఈరోజు నుండీ మనతోబాటే ఉంటుంది'' అతని సందేహం తీర్చింది.

బామ్మ చాలా విచిత్రంగా అనిపించింది అతనికి. సాధారణంగా యాభై అయిదు ఏళ్ళు దాటిన వారంతా హోం ఫర్ ఏజ్డ్‌లో ఉంటారు. అందుకే తెల్లబడిపోయిన జుత్తుతో, లావు కళ్ళజోడుతో, జారిపోయిన చర్మంతో బామ్మ చాలా గమ్మత్తుగా అనిపించింది అతనికి.

బామ్మ నెమ్మదిగా వచ్చి ఒంగొని అతని బుగ్గమీద ముద్దు పెట్టుకొని తల నిమిరింది. ఆమె కంట్లో నీరు నిండటం స్పష్టంగా కనిపించింది.

ఆమె ముద్దు పెట్టుకోవడంతో విషాల్ కొంచం సిగ్గుపడ్డాడు. అయినా కొత్త ఫ్రెండ్‌కి తన గది చూపించాడు.

తనతో మాట్లాడడానికి ఒక మనిషి దొరకడంతో అతనికి ఎంతో ఉత్సాహం అనిపించింది. వరదొచ్చినట్టు మాటలు గడగడా వచ్చేసాయి.

ఎంతసేపూ కంప్యూటర్‌తోటే మాట్లాడే అతనికి బామ్మతో మాట్లాడుతుంటే ఎంతో రిలాక్స్‌డ్‌గా అనిపించింది.

★ ★ ★

సతీష్ చంద్ర, కాదంబరిల ఏకైక కొడుకు విషాల్. ఇద్దరూ కంప్యూటర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్నారు.

అతని తండ్రి చనిపోయి చాలాకాలం అయ్యింది. తల్లి ''సెయింట్ జార్జ్ హోం ఫర్ ఏజ్డ్'లో ఉండేది. కానీ ఆ వృద్ధాశ్రమానికి



అమెరికా నుండి ఫండ్స్ ఆగిపోవడంతో అందులోని వారినందరినీ వారి వారి బంధువులకి అప్పగించేసారు.

''ఏం చేద్దామని నిర్ణయించారు?'' ఆరాత్రి కాదంబరి అడిగింది.

ఆశ్చర్యంగా ఆమెవంక చూసాడు సతీష్ చంద్ర. ''ఇంకా ఏం డిసైడ్ చెయ్యాలి? నేను ఆఫీస్ నుండే 'స్టాలిన్ హోం ఫర్ ఏజ్డ్' వాళ్ళతో మాట్లాడేసాను.''

ఆమె సందిగ్ధంలో కాసేపు ఉండిపోయింది. ''వాటీజ్ రాంగ్ విత్ యూ?'' ఆమె ప్రక్కకొచ్చి కూర్చుని అడిగాడు.

''విషాల్‌ని మీరు గమనించారా? ఎప్పుడూ మూడీగా ఎవర్నీ పట్టించుకోకుండా ఉండే వాడు. కానీ ఈవేళ పొద్దున్న మీ అమ్మగారిని తీసుకొచ్చాక వాడిలో ఎంతో మార్పు

కనిపించింది. ఎంతో ఉత్సాహంగా, చలాకీగా కనిపించాడు. యూనో ఆఫ్టర్ ఎలాంగ్ టైం ఐ హేవ్ సీన్ హిమ్ లాఫింగ్. దీన్నిబట్టే తెలియట్లేదు అతను ఒక ఫ్రెండ్ కోసం, ఒక ప్రేమకోసం ఎంత తపించిపోతున్నాడో. మొన్న పక్క ఫ్లాట్‌లో ఉండే లక్ష్మి మన విషాల్ సిగిరెట్ కాలుస్తుంటే చూసారట. మనకా సంగతే తెలియదు. వాడి విషయంలో మనమేమాత్రం శ్రద్ధ తీసుకోలేకపోతున్నాం. మొన్న క్వార్టర్లీలో వాడికి ఎన్ని మార్కులొచ్చాయో మనకి తెలియదు. ఇంకొన్నేళ్ళయితే వాడు ఏ స్కూల్‌లో చదువుతున్నాడో, ఏం చదువుతున్నాడో కూడా మనం మర్చిపోతామేమో...''

ఆమె వాక్ప్రవాహాన్ని మధ్యలోనే ఆపాడు ''ఇంతకీ నువ్వు ఏం చెప్పదల్చుకున్నావు?''

''బహుశః విషాల్‌కి ఇవ్వవలసినంత ప్రేమ మనం ఇవ్వట్లేదనో, వాడి గురించి పట్టించు కోవట్లేదనో నాకు చాలా గిల్టీగా అనిపిస్తోంది. ఈవేళ మధ్యాహ్నం మీ అమ్మగారే దగ్గరుండి వాడికి అన్నం తినిపించారు. వాడు కూడా ఆవిడకి ఎంతో దగ్గరయ్యాడు.''

గట్టిగా ఊపిరి పీల్చుకొని చెప్పింది, ''ఆవిడ కూడా మనతోబాటే ఉంటే మనకు కూడా ఒక పెద్ద దిక్కుగా ఉంటుంది. విషాల్ కూడా ఎంతో సంతోషిస్తాడు. నా మనోవ్యధ తీరు తుంది. ఎలాగూ ఇద్దరు సంపాధిస్తున్నాం కాబట్టి పెద్ద బర్డెన్ అవ్వదు. నువ్వే మంటావు?''

''అనేదంతా నువ్వే అనేసాక ఇంక నేనే మంటాను. హోం డిపార్ట్‌మెంట్ వారి ఆజ్ఞ శిరసావహిస్తాను.''

★ ★ ★

''ది నేషన్''

భారతదేశంలో అత్యధిక సర్క్యులేషన్‌గల దిన పత్రిక అది. న్యూస్‌పేపర్ చదివే అలవాటు ఉన్న వారిలో ఎనభై తొమ్మిది శాతం మంది ఆ పేపర్‌నే ప్రిఫర్ చేస్తారని ఒక సర్వేలో తేలింది.

(పేపర్ చదువుతారు అంటే కాగితం మీద కాదు కంప్యూటర్ స్క్రీన్ మీద. ఇంటర్‌నెట్ విజృంభణతో ప్రింట్ మీడియా మొత్తం కంప్యూటర్‌లోకి వెళ్ళిపోయింది.)

ఆ పేపర్ (?)లో అత్యధిక సంఖ్యలో పాఠకులు ఇష్టపడే శీర్షిక 'సండే స్పెషల్' అందులో పాఠకులే పాల్గొనచ్చు. విషాల్ పాల్గొన్నాడు.

★ ★ ★

''హలో ఫ్రెండ్స్! నాపేరు విషాల్. నేను హైద్రాబాద్ గ్రామర్ స్కూల్‌లో సెవెన్త్ స్టాండర్డ్ స్టూడెంట్‌ని. చిన్నప్పటి నుండీ నా బెస్ట్ ఫ్రెండ్ కంప్యూటరే. కానీ ఒక్క వారం రోజుల క్రితం పరిచయం అయినా నాగ్రాండ్‌మా ఇప్పుడు నా క్లోజెస్ట్ ఫ్రెండ్.''

''కంప్యూటర్ ఎన్నడూ ప్రేమని రెసిప్రోకేట్ చెయ్యలేదు కానీ బామ్మ చెయ్యగలదు. మా బామ్మ నా గురించి ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. పొద్దున్న నుండీ రాత్రి వరకూ ఎన్నో రకాలుగా సహాయాలు

చేస్తుంది, సలహాలు ఇస్తుంది. మంచి మంచి కథలు చెబుతుంది. దగ్గరుండి అన్నం కూడా తినిపిస్తుంది. మొన్న నాకు జ్వరం వచ్చినప్పుడు నా దగ్గరే కూర్చుంది. రాత్రంతా నిద్ర కూడా పోలేదు. ఎందుకో తెలియలేదు. కానీ ఎంతో సంతోషంగా అనిపించింది. నాకు ఏది మంచో, ఏది చెడో అర్థమయ్యేలా చెబుతుంది. ఆమె దగ్గరుంటే నాకు ఎంతో సురక్షితంగా ఉన్నట్టు అనిపిస్తుంది.''

''అంతే కాదు మా బామ్మ ఎన్నో రకాల తినుబండారాలు ఎంతో రుచికరంగా చేసి దగ్గరుండి తినిపిస్తుంది.''

''కంప్యూటర్ ఎన్నో విషయాలు చెప్పినా మా బామ్మ ఏది మంచి, ఏది చెడు అనేది చెప్పి దగ్గరుండి చేయిస్తుంది కూడా. మా బామ్మే నాతో సిగరెట్స్ మాన్పించింది.''

''ఫ్రెండ్స్! అన్నిటికంటే నాకు బాధ అనిపించింది ఏమిటంటే, ఇక్కడ మనం ఎంత ఒంటరిగా, బోర్‌గా ఫీలౌతామో అక్కడ వాళ్ళకు కూడా అలానే ఉంటుందిట.''

''తమతో ఆడుకోడానికి చిన్న చిన్న మనవళ్ళు, మనవరాళ్ళు లేరని ఎంతో బాధపడతారుట. మీరందరూ కూడా మీ మీ బామ్మలనో, అమ్మమ్మలనో, తాతయ్యలనో ఇంటికి తెచ్చుకోండి. ఎంతో ఆనందంగా ఉంటుంది. వాళ్ళు కూడా ఎంతో హేపీగా ఫీలౌతారు.''

చిన్న చిన్న వాక్యాల్లో అమాయకంగా తనకూ తన బామ్మకూ మధ్య అనుబంధాన్ని, స్నేహాన్ని వెల్లడించాడు.

## మోసం

''భర్త లేని సమయాన రాత్రిళ్ళు పరాయి మగాడితో గడపడం మోసం కాదా?'' అడిగాడు వకీలు.

''వారం రోజులు రానని చెప్పి వెళ్ళి మూడు రోజులకే తిరిగి వచ్చారే వారు నన్ను మోసం చేయలేదా?'' అంది ముద్దాయి స్త్రీ.

- సిరిసిల్లా రశీద్
(దోన్కల్)

★ ★ ★

''దినేషన్''లో అది పబ్లిష్ అయ్యాక దేశవ్యాప్తంగా ఒక సెన్సేషన్‌గా మారింది. ఎక్కడ చూసినా ఆ విషయాన్ని గురించిన డిస్కషన్లే.

అది అంత టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారిపోతుందని విషాల్ గానీ, పత్రిక ఎడిటర్‌గానీ భావించలేదు. కేవలం ఒక చిన్నపిల్లవాడి అమాయకపు భావాల్ని ప్రచురించాడు.

కానీ ఇదంతా చూసాక అతనికి కొత్త ఆలోచన వచ్చింది. వెంటనే దేశవ్యాప్తంగా సర్వే కండక్ట్ చేసారు. ఎనిమిది నుండి పద్దెనిమిది సంవత్సరాల మధ్య వయసుగల వేల సంఖ్యలో పిల్లల్ని ఇంటర్వ్యూ చేసారు.

దాదాపుగా అందరూ ఒకేమాట. తమకు కూడా గ్రాండ్ మానో, గ్రాండ్ పానో ఉంటే

ఎంతో బాగుండేదని. తాము వారితో కలిసి ఉండాలని ఎంతో అనుకుంటున్నామని.

పత్రిక వాళ్ళు అంతటితో ఆగలేదు. ప్రఖ్యాత చిల్డ్రన్ సైకాలజిస్ట్ థామ్సన్‌తో ఇంటర్‌వ్యూ కూడా ప్రచురించింది. ఆయన ఎన్నో ఆసక్తికర అంశాలు వెల్లడించారు.

తాతయ్యలో, అమ్మమ్మలో ఉన్న పిల్లలు మిగతావారి కంటే ఎంతో చురుకుగా, ఆక్టివ్‌గా ఉంటారని, మిగిలిన వారంత తొందరగా చెడు అలవాట్లకు లోనవ్వరనీ, మానసిక ఎదుగుదల మిగతావారికంటే అధికంగా ఉంటుందనీ సశాస్త్రీయంగా వెల్లడించాడు.

వారం రోజులలోనే వివిధ వృద్ధాశ్రమాల నుండి కొన్నివేల మందిని వారి వారి బంధువులు, పిల్లలు వచ్చి తమతో తీసుకెళ్ళారనే వార్త 'ది నేషన్' హెడ్‌లైన్స్‌లోకి చేరింది.

★ ★ ★

2046 జనవరి ఒకటి.

రాత్రి పన్నెండు గంటల నుండి ఉదయం ఆరుగంటలకు విషాల్ నిద్రలేచేలోపు దేశం నలుమూలల నుండీ కొన్నివేల గ్రీటింగ్స్ అతని కంప్యూటర్‌లో రికార్డ్ అయ్యాయి. ఇంకా ఎన్నో వస్తున్నా కంప్యూటర్ కెపాసిటీ మించిపోవడంతో అవి రిజిస్టర్ కాలేదు.

విషాల్ నిద్రలేచి అది చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. కొన్నివేల మంది అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు గ్రీటింగ్స్ పంపారు.

పరిగెత్తి వెళ్ళి బామ్మని నిద్రలేపి న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పి తీసుకొచ్చి అవన్నీ చూపించాడు.

బామ్మ ప్రేమగా అతన్ని ముద్దుపెట్టుకొని తల నిమిరింది.

ప్రతిరోజూ రాత్రి డైరీ రాయడం అతనికి అలవాటు (కంప్యూటర్‌లో). ఆరోజు రాత్రి ఒకే ఒక్క వాక్యం రాసాడు, 'ఐ లవ్ యూ... బామ్మా!'

★